ఆంధ్రజ్యోతి ప్రవాస

# డాలస్‌లో మహాత్మా గాంధీకి ఘన నివాళి



**డాలస్, టెక్సాస్:** మహాత్మాగాంధీ 70వ వర్ధంతిని పురస్కరించుకుని.. అమెరికాలోని ప్రవాసులు జాతిపితకు ఘననివాళి అర్పించారు. వందలాది మంది ప్రవాస భారతీయులు డాలస్ (ఇర్వింగ్)లో ఉన్న మహాత్మా గాంధీ మెమోరియల్‌ను సందర్శించారు. ఎస్ పి నాగ్రాత్ అనే స్థానిక గాయకుడు గాంధీజీకి ఇష్టమైన రఘుపతి రాఘవ రాజారామ్ కీర్తనను ఆలపించారు.

మహాత్మా గాంధీ మెమోరియల్ ఆఫ్ నార్త్ టెక్సాస్ కార్యదర్శి రావు కల్వల మాట్లాడుతూ స్థానిక ప్రజల సహకారంతో అతి పెద్ద గాంధీ మెమోరియల్‌ను ఇక్కడ నిర్మించుకున్నామన్నారు. తద్వారా భావితరాలకు స్ఫూర్తిదాయకంగా చూపడానికి అవకాశం కలిగిందని, గాంధీజీ సేవలను స్మరించుకోవడానికి వచ్చిన వారందరికీ ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

(ఫొటో గ్యాలరీ కోసం క్లిక్ చేయండి)

గాంధీజీ మరణించి 70 ఏళ్లు అవుతున్నప్పటికీ ఆయన సిద్ధాంతాలు, ఆశయాలతో మనందరి మధ్య ఎప్పటికీ సజీవంగానే ఉంటారని గాంధీ మెమోరియల్ ఛైర్మన్ డాక్టర్. ప్రసాద్ తోటకూర అన్నారు. దేశ స్వాతంత్ర పోరాటంలో 32 సంవత్సరాలు తన జీవితాన్ని అంకితం చేసి లక్షలాది ప్రజలను నిరంతరం చైతన్య పరచారని గుర్తు చేశారు. అహింసా మార్గం ద్వారా దేశానికి స్వాతంత్రం సాధించిన తీరు అనితర సాధ్యమన్నారు. ప్రవాస భారతీయులంతా గాంధీ చూపిన బాటలో పయనిస్తూ సమానత్వం, సామాజిక న్యాయం ఉండే ఒక మంచి సమాజ స్థాపనకు అందరూ కృషి చేయాలని ప్రసాద్ తోటకూర పిలుపునిచ్చారు.
గాంధీజీ విశ్వ మానవాళికి ఒక ఆదర్శప్రాయమైన వ్యక్తి అని, ఆయన సిద్ధాంతాలతో ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది ఉత్తేజితులయ్యారని గాంధీ మెమోరియల్ బోర్డు ఆఫ్ డైరెక్టర్ కమల్ కౌషల్ అన్నారు. గాంధీజీ శాంతి, సహనానికి ప్రతి రూపమని, ఆయన గురించి ముఖ్యంగా యువతరం ఎంతో తెలుసుకొని తమ భవిష్యత్తును తీర్చుదిద్దుకోవచ్చని ఐఏఎన్టీ ఉపాధ్యక్షులు బిఎన్ చెప్పారు. గాంధీజీ తన సాధారణ, పారదర్శక జీవితంతో ఎంతో మందికి ఆదర్శప్రాయులయ్యారని, ఆయనకు మరణం లేదని ఎన్ని దశాబ్దాలైనా అందరూ జాతిపితను గుర్తించుకుంటారని మహాత్మా గాంధీ మెమోరియల్ బోర్డు ఆఫ్ డైరెక్టర్ షబ్నమ్ మోడ్గిల్ వ్యాఖ్యానించారు.